# అమృతం కురిసిన రోజు

ఆ రోజు భాద్రపద బహుళ అష్టమి. రోజులాగే ధాత్రీశ్వరాదేవి రాత్రి భోజనం చేసిన తరువాత వెళ్ళి పెరట్లో ఆరుబయట కూర్చుంది. పక్కనే తులసికోట గూటిలో దీపం వెలుగుతూనే ఉంది. పచ్చని చేమంతులతో ముడుచుకున్న ఎఱ్ఱని మందారాలతో కలకల్లాడుతోంది. ఒక పక్క కీచురాళ్ళగోల, మరో పక్క నిండిన గుంటల్లో పంటకాలువల్లో కప్పలు బెకబెకమంటూ అరుస్తున్నాయి. వీధి అరుగుమీద కూర్చుని పేకాడుతున్న మగవారి గొంతులు వినబడుతున్నాయి.

ధాత్రీశ్వరీదేవి ఆకాశంవైపు చూసింది. అంతా చీకటి, ఎక్కడో దూరంగా తెల్లని దూది ఏకులా చంద్రవంక కనబడుతోంది. ఎందుకో ఆమెకు నవ్వు వచ్చింది. ఆ నవ్వు చీకటి నవ్వు. అది ఎవరికీ కనపడని నవ్వు. "నా జీవితంలో కూడా వెన్నెల దూరమవుతుందా!" మనసులో అనుకుంది.

ధాత్రీశ్వరీదేవి ఇప్పుడు ఒంటరిది. ఆమెకు తోడుగా ఇంట్లో ఉంటున్న రత్తమ్మగారు ఆవిడకు కాస్త దూరంలో కూర్చుంది.

"ఆకాశంవైపు చూస్తున్నారేమిటటా!" అనడిగింది.

"ఏం లేదు రత్తమ్మా! ఒకప్పుడు అమావాస్య రోజు కూడా నిండు పున్నమిలా ఉండేది. ఇప్పుడు పున్నమిరోజు కూడా అమావాస్యలా కనపడుతుందేమని ఆలోచిస్తున్నా!"

ఆవిడ సమాధానం విన్న రత్తమ్మగారికి ఏం సమాధానం చెప్పాలో తోచలేదు.

"ఒకప్పుడు ఇల్లు ఎంత సందడిగా ఉండేది! బాబుగారు ఒక్కరు అసలు పది మంది పెట్టు. ఊళ్ళోకి ఎవరు వచ్చినా ఈ ఇంట్లో భోజనం చేయవలసిందే! పూటక కుంచెడు గిన్నె వార్చవలసిందే! అత్తమామ, ఆడబిడ్డలు మధ్యలో ఈవిడ పూచిన ముద్ద మందారంలా కలకల్లాడేది" అనుకుంది రత్తమ్మ. రత్తమ్మ ఆ యింటి యజమాని రాఘవయ్యగారు పోయింది మొదలు ధాత్రీశ్వరీదేవిని కనిపెట్టుకుని ఆ ఇంట్లోనే ఉంటోంది.

ఆ దంపతులకి లేక లేక పుట్టాడు అమర్‌నాథ్. ఆ పిల్లాడికి తండ్రి సరిగా తెలియదు. పదేళ్ళురాకుండానే తండ్రి చనిపోయాడు. ధాత్రీశ్వరీదేవికి సర్వం కొడుకే. ఆ పన్నీరత్తమ్మకి తెలుసు. అందుకే ఆవిడంటే ఆ రత్తమ్మకి అంత అభిమానం.

"రత్తమ్మా! నేనేంలోపం చేసానని అబ్బాయి నన్ను ఒంటరిదాన్నిచేసి అంతదూరం వెళ్ళాడంటావు? ఇక్కడే పుచ్చపూవు లాంటి తెల్లని వెన్నెల్లో వాడిని నా భుజాన వేసుకుని 'జో అచ్యుతానంద జో! జో! ముకుందా!' అంటూ యశోదనై జోకొట్టే దాన్ని! అన్నం తిననని మారాం చేస్తే చందమామరావె, జాబిల్లి రావె!" అంటూ బతిమాలి గోరుముద్దలు తినిపించేదాన్ని. ఆనాడు కిందికిరాని చందమామను రప్పిస్తానని అబద్ధాలు చెప్పినా నా మాటకాదనేవాడు కాడు. కాని ఈనాడు అన్నీ నిజాలు చెబుతున్నా వాడు నా మాటకాదని దూర తీరాలకు వెళ్ళిపోయాడు. పెంచడంలో నా లోపమేమైనా ఉందా?" ఆమె కళ్ళు జల జలా వర్షించాయి. ఆవిడను చూస్తున్న రత్తమ్మ కళ్ళు కూడా వర్షించాయి.

"అమ్మా! నీకు చెప్పేటంత పెద్దదాన్నికాదు. కాని ఈ రోజుల్లో మీ అబ్బాయేకాదు పెద్ద చదువులు, చిన్న చదువులు అనే తేడాలేకుండా అందరూ అమెరికాయే వెడుతున్నారు. మీ లోపం కాదమ్మా! పువ్వుల్లో పెట్టి అల్లారు ముద్దుగా పెంచారు. త్వరలో వస్తానన్నాడుగా! తప్పకుండా వస్తాడమ్మా!" రోజూ రత్తమ్మ ఆవిడ బాధపడినప్పుడల్లా ఆ మాటలు అంటూనే ఉంటుంది. రత్తమ్మ మాటలు ఆవిడకు కాస్త ఊరట కలిగిస్తూనే ఉంటాయి. మనసులో బాధ ఎవరితోనైన చెప్పుకుంటే పోతుందంటారు. ధాత్రీశ్వరీదేవికి కూడా అదే అలవాటు.

"అమ్మా! ఆకాశమంతా మబ్బులు ఆవరిస్తున్నాయి. రండి! లోపలికి వెడదాం. పైగా ఈ మధ్య ఊళ్ళో దొంగల భయంకూడా ఎక్కువయింది. లేవండి!" రత్తమ్మ తొందర చేసింది.

"ఎంతైందంటావు?"

"లోపలికి వెళ్ళి గడియారం చూసిరానా!"

"అక్కర్లేదులే!" ధాత్రీశ్వరీదేవి లేస్తూనే ఉంది. అంతలో టపటపా చినుకులు ప్రారంభమయ్యాయి.

ఇద్దరు గబగబా లేచి లోపలికి వచ్చారు. రత్తమ్మ తలుపులకు గడియలు పెట్టింది. ఎవరి మంచాల మీద వాళ్ళు నడుం వాల్చారు.

"రత్తమ్మా! మొన్న ఆదివారం 9వ తేదీన అబ్బాయి ఎందుకు ఫోను చెయ్య లేదంటావు?"

"అదేమిటమ్మా అలా అంటావు? మొన్నాదివారం ఊళ్ళో ఉండను మళ్ళీ ఆదివారం చేస్తానని చెప్పాడుగా! కిందటి శుక్రవారమే కదా ఫోను చేస్తా!"

"నిజమే రత్తమ్మా! మర్చిపోయాను".

"అనవసరమైన ఆలోచనలన్నీ మానేసి ఇంక పడుకోండమ్మా!"

"సరేలే!" రత్తమ్మకి సమాధాన మిచ్చి ఆవిడ కళ్ళు మూసుకుంది.

ప్రతి ఆదివారం ధాత్రీశ్వరీదేవికి అదో పండుగ. కొడుకు అమర్ తప్పకుండా ఫోను చేస్తాడు. ఆవిడ అన్ని పనులు త్వర త్వరగా ముగించుకుని ఫోనుకు ఎదురుగా బల్ల మీద కూర్చుంటుంది. ఆ సావిట్లో వాలు కుర్చీలో భర్త కూర్చుంటే ఆయనకు ఎదురుగా ఆవిడ ఆ బల్లమీదే కూర్చునేది. పగలు భోజనం అయ్యాక ఆ బల్ల మీదే పడుకునేది. భర్త చనిపోయినా ఆవిడ ఆ అలవాటు మార్చుకోలేదు. ఆ బల్ల మీద కూర్చుంటే భర్త ఎదురుగా వాలుకుర్చీలో కూర్చున్నట్లే ఆవిడకు అనిపిస్తుంది. తాను ఆ బల్లమీద కూర్చుని కొడుకుతో ఫోనులో మాట్లాడుతూంటే ఆ కుర్చీలో కూర్చుని ఆయన కూడా వింటాడని ఆమె భావిస్తుంది. ఆ వూళ్ళో ఎవరింట్లోను ఫోనుల్లేవు. ముఖ్యమైన వారిళ్ళల్లోనే ఫోనులు పెట్టించుకున్నారు. ధాత్రీశ్వరీదేవి అమెరికాలో ఉన్న తన కొడుకుతో మాట్లాడ్డానికే ఫోను పెట్టించుకుంది. "ప్రతి ఆదివారం ఫోను చెయ్యాలి" ఆ తల్లీ కొడుకుల మధ్య ఒప్పందం అది.

"అమ్మా! అమ్మా! నాకు గోరుమీటీలు తినాలని ఉందమ్మా! నాకు చేసి పెట్టవా?" ఫోనులోనే గారాలు పోతాడు కొడుకు.

"బుట్టెడు చేసి పెడతా! రేపు రావాలిసుమా!" తల్లి సమాధానం.

"అమ్మా! అమ్మా! ఈ పూట నువ్వు గోరుముద్దులు తినిపిస్తేనినే నేను అన్నం తింటా! లేకపోతేనే భోజనం చెయ్యనమ్మా!" తల్లిని మురిపిస్తాడు ఆ కొడుకు.

"ఇదిగో ఇప్పుడే కలుపుతున్నా! ఫోనులోనే తినిపించనా!". తల్లి సమాధానం విని "అమ్మా! అమ్మా! ఇంక చాలు! చాలు కడుపు నిండిపోయిందమ్మా!" మరింత మురిపిస్తాడు కొడుకు. మురిసిపోతుంది ఆ తల్లి.

"అమ్మా! అమ్మా! నాకు నిన్ను చూడాలని ఉందమ్మా! నేను ఇండియా వచ్చేస్తున్నా! బెంగపెట్టుకోకు! ఎప్పుడు వచ్చేది ఫోను చేసి చెబుతా! సరేనా! నా మీద ఒట్టు. బెంగ పెట్టుకోకూడదమ్మా! సరేనా! ఇంక ఫోను పెట్టేస్తున్నా!" ఫోనులో మాటలు ఆగిపోతాయి. డయల్ టోనువచ్చేస్తుంది. అయినా ఆవిడ చేతుల్లో ఆ ఫోను అలాగే కాసేపు ఉండిపోతుంది. ఆ తల్లీ కొడుకుల సంభాషణ ఓ దృశ్య రూపకంలా అక్కడున్న వాళ్ళకి అనిపిస్తుంది. సాధారణంగా ఆ రత్తమ్మకే ఆ అదృష్టం దక్కుతుంది. అందుకే

ఆదివారం రాగానే రత్తమ్మ కూడా వంటపని తెమిల్చేసుకుని ఫోను పక్కనే చాపేసుకుని కూర్చుంటుంది. ముసి ముసినవ్వులతో వారి సంభాషణ వింటుంది.

చివరికి ఫోను పెట్టకుండానే ధాత్రీశ్వరీదేవి పుట్టెడు దుఃఖం కడుపులో దాచుకోలేక వెక్కి వెక్కి ఏడుస్తుంది. ఆమెను చూడలేక కన్నీళ్ళు కారుతుండగానె ఆమె చేతిలో ఫోను అందుకుని యధాస్థానంలో పెట్టేస్తుంది. ఆ దుఃఖం కేవలం దుఃఖంకాదు. ధాత్రీశ్వరీదేవిగారి సుఖదుఃఖాల కలయిక. కొడుకుపైప్రేమకు పరాకాష్ఠ. వరద తగ్గిన తరువాత నదిలా ఆమె మనస్సు ప్రశాంతమవుతుంది. కొడుకు ఫోటో పక్కనే పెట్టుకుంటుంది. మద్యమధ్యలో ఆ ఫోటో మీద చేత్తో రాస్తూ ఉంటుంది. ఆమెకు అదో ఊరట.

రత్తమ్మకు నిద్రపట్టినట్టు కాస్త గురక వినబడుతోంది. ధాత్రీశ్వరీదేవికి కూడా నిద్రపట్టిందని బరువుగా వచ్చే ఆమె ఉచ్ఛ్వాస నిశ్వాసాలే చెబుతున్నాయి.

"అమ్మా! అమ్మా!" ఎవరో తలుపు గట్టిగా బాత్తున్నారు. ఇద్దరికి ఒకే సారి మెళకువ వచ్చింది. ఇద్దరు మంచాల మీద లేచి కూర్చున్నారు.

"రత్తమ్మా! ఎవరంటావు?"

"ఏమో నమ్మా! తెలీదు" అంటూనే "ఎవరది?" గట్టిగ అడిగింది.

"నే నమ్మా! పెంటన్నను" అవతలి వ్యక్తి సమాధానమిచ్చాడు.

"రత్తమ్మా! వెళ్ళి త్వరగా తలుపు తియ్యి" ధాత్రీశ్వరీదేవి తొందర చేసింది. ఎందుకో ఆవిడ మనస్సులో చెప్పలేని ఆందోళన ప్రారంభమయింది.

"నువ్వా పెంటన్నా! ఇంత అర్ధరాత్రి బయలుదేరావేమిటి?" రత్తమ్మ తలుపు తీసి అడిగింది.

"అమ్మా! అమ్మా! అక్కడ అమెరికాలో" అతని మాటలు తడబడుతున్నాయి.

"ధాత్రీశ్వరీదేవిగారికి 'అమెరికా' అని వినపడగానే కాళ్ళు చేతులు వణకడమే కాదు. కాలికింది నేల కదిలినట్లయింది. నోట మాట పెగల్లేదు. అతనికేసి చూస్తూ తిరిగి మంచం మీద కూల బడిపోయింది.

"చెప్పు! చెప్పు! పెంటన్నా! త్వరగా చెప్పు?" రత్తమ్మ తొందర చేసింది.

"వాషింగ్టన్‌లో అబ్బాయి పని చేసే ఆఫీసు భవనాన్ని విమానంలో వచ్చి కూల్చేసారుట!" పెంటన్న నోరు పెగల్చుకుని ఎలాగో అలాగ ఆ మాటలు చెప్పేసాడు.

ఆ వార్త అప్పటికే విన్నవారంతా ఆ ఇంటికి చేరారు.

"ఎవరు కూల్చేసారు? ఎందుకు కూల్చేసారు?" రత్తమ్మ మాట వణికింది.

"అవన్నీ తెలవు. ఎవరో ఉగ్రవాదులుట. అమెరికామీద కక్షతో కూల్చేసారుట. అన్ని అంతస్తుల భవనం నేలమట్టమై పోయిందిట"

రత్తమ్మకు నోట మాట రాలేదు.

ధాత్రీశ్వరీదేవి "బాబూ!" అంటూ అచేతనంగా మంచం మీద వాలిపోయింది.

టి.వి.లు కట్టేసి ఆ వీధి వాళ్ళంతా ధాత్రీశ్వరీదేవి ఇంటికి చేరుకున్నారు.

"ముఖం మీద నీళ్ళు జల్లండి" అంటూనే కొందరు రత్తమ్మ అందించిన చెంబుతో నీళ్ళు ఆమె ముఖం మీద జల్లారు. ఆమె కళ్ళు విప్పి చూడలేదు.

"ఎందుకైనా మంచిది డాక్టర్ని పిలిపించండమ్మా!" అన్నాడో పెద్ద మనిషి.

"అయ్యో ఇదేమిటండీ చేతులు కాళ్ళు చల్లబడుతున్నాయండీ!" దగ్గర బంధువు మొత్తుకుంది.

ఎదిరింటి అబ్బాయి సైకిలు మీద డాక్టరు దగ్గరకు బయలుదేరాడు.

ఈ మధ్య ఆ వూరుకు కొత్తగా వచ్చిన ప్రభుత్వ ఆసుపత్రి డాక్టరు వైద్యం బాగా తెలిసినవాడు. పైగా చాలా శ్రద్ధగా చేస్తున్నాడు. ఆ వూళ్ళో అందరికి తలలో నాలుకలా ఉన్నాడు. ఆ పల్లెల్లో అందరికి ఆత్మ రక్షకుడు వైద్యుడే.

"అమెరికాలో పొద్దున్న జరిగిందిట. రాజధానియైన వాషింగ్టన్ డి.సిలో పెంటగాన్ భవనం కూల్చేసారుట. అసలు వైట్‌హౌసునే నాశనం చేద్దామనుకున్నారట. అక్కడ వారి పప్పులుడక్క ఈ పని చేసారుట!" ఎవరు విన్న వార్తలు వాళ్ళు చెబుతూనే ఉన్నారు.

"అయ్యో! అయ్యో! ఇదేం పొయ్యే కాలమండీ! అమాయకుల్ని పొట్టన పెట్టుకున్నారు కదండీ!"

"వాళ్ళ చేతులు పడిపోను, వాళ్ళ బుర్రలు పాడైపోను, వాళ్ళ తెలివి చచ్చుపడిపోను".

కొందరు ఆడవాళ్ళు ఏమీ చెయ్యలేక ఆ వార్తలు వినలేక, ఆవిడను ఆ స్థితిలో చూడలేక తిట్టిపోసారు.

అంతలో డాక్టరు రానేవచ్చాడు. ఆవిడ చుట్టూ చేరిన వాళ్ళంతా పక్కకు తప్పుకున్నారు. జరిగిన సంఘటన వాళ్ళు చెప్పగా విన్నాడు. ఆవిడను పరీక్షించిన డాక్టరు ఇంజక్షనిచ్చాడు.

"అవిడకు స్పృహరావచ్చు. ఆవిడకు వినబడేటట్టు ఏమీ అనకండి. పైగా అటువంటి సంఘటనలు కావలసిన వారికి అంత హఠాత్తుగా చెప్పకూడదు. మీకు ఆమాత్రం తెలీకపోతే ఎలాగండీ!" అందరినీ మందలించాడు డాక్టరు.

"ఒక్కగా నొక్కకొడుకండి! ఆవిడ ఒంటరిగా కొడుకు మీది ప్రేమతో బతుకుతోంది. పైగా మా అందరికి తల్లిలాంటిది! ఆ వార్త ఆవిడకు చెప్పకుండా ఉండలేకపోయామండీ!" పెంటన్న రెండు చేతులతో ముఖం కప్పుకుని "నా వల్లే ఇదంతా జరిగింది. నే చెప్పకపోతే ఇలా జరిగేది కాదు" అంటూ వెక్కి వెక్కి ఏడ్చాడు.

"నువ్వు ఏడ్చి మమ్మల్ని ఏడిపించకు. నువ్వు కాకపోతే మరెవరైనా చెబుతారు. ఊరుకో!" అన్నారు కొందరు.

"మతుల్లేకుండా మేముంటే మధ్యలో నీ గోలేమిటి?" మందలించింది రత్తమ్మ. పెంటన్న తలవంచుకుని కళ్ళు తుడుచుకున్నాడు.

ధాత్రీశ్వరీదేవి మెల్లిగా కళ్ళు విప్పింది. అందరివైపు చూసింది. ఆ ముఖంలో ఆశ్చర్యం లేదు. ఆనందంలేదు. పెదాలు మెల్లిగా విప్పింది. ఏదో అడగాలనుకుంది కాబోలు. అడగలేకపోయింది. ఇందాక జరిగిన సంఘటన జ్ఞాపకం వచ్చినట్లుంది. తిరిగి కళ్ళు మూతలుపడి తలపక్కకు వాలింది. విప్పకున్న పెదాలు సగంలో అలాగే ఉండిపోయాయి.

"డాక్టరుగారూ! అమ్మని చూడండీ!" రత్తమ్మ కంగారు పడింది. ఆమెకు కాళ్ళూ చేతులూ ఆడ్డంలేదు. గుండెల్లో చెప్పలేని బాధ, భయం.

"అమ్మను ఎలాగైన కాపాడండీ!" అంటు ఏడుపు మొదలు పెట్టింది.

"భయపడకండి! ఆమె ప్రాణానికేమీ భయం లేదు. చాలా నీరసంగా ఉంది. వేడి వేడి పాలు తాగిస్తే మంచిది. మందులు వెయ్యాలి. ఆవిడ మింగే స్థితిలో లేదు. అందుకే గ్లూకోజ్ వాటర్ ఎక్కించడానికి ఏర్పాటు చేయిస్తాను. మీరు కంగారుపడి ఆవిడను కంగారుపెట్టకండి.

డాక్టరు మాటలతో అందరికి కాస్త ధైర్యమొచ్చింది. వెంటనే ఆ మంచం దగ్గరే ఆయన అన్ని ఏర్పాట్లు చేసాడు. అందరు వింతగా చూసారు.

"ఆ సీసా ఎక్కగానే ఆవిడ కోలుకుంటారు. భయం లేదు. అయినా ఆవిడ కొడుకు ఆ శిథిలాలలో ఉండిపోయాడని ఎలా అనుకున్నారండీ? ఆయన ఆ ఆఫీసులోనే పని చేస్తున్నాడని మీకెలా తెలుసు? పైగా ఆ రోజు ఆఫీసుకు వెళ్లాడో లేదో?" డాక్టరు ప్రశ్నలకు అందరూ ఆలోచనల్లో పడ్డారు.

"బతికి ఉంటే ఈ పాటికి ఫోను చేసి ఉండాలికదండీ!" కొందరు అనుమానం వెళ్ళబుచ్చారు.

"లైను దొరక్కద్దండీ! ఇక్కడ నుండి అక్కడికి చేసేవాళ్ళతో అక్కడ నుండి ఇక్కడకు చేసేవాళ్ళతో అన్ని లైన్లూ బిజీ ఉన్నాయి. మా అన్నగారి కొడుకు ఫోను చేసాడు, కంగారు లేదుటండీ!" ఒకాయన పరుగెత్తుకుంటూ వచ్చి సమాచారం అందించాడు.

"అందరు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. అయినా భయం వదల్లేదు. గ్లూకోజు సీసా పూర్తయింది. మరొకటి మందులు కలిపి మరీ పెట్టాడు డాక్టరు.

ధాత్రీశ్వరీదేవి పిండి బొమ్మలా పడుకునే ఉంది. ఆవిడను చూస్తే రత్తమ్మకి దుఃఖం ఆగడం లేదు. అప్పటికే తెల్లవారకట్ల 4 గం॥ అయింది. ఆ భయంలో టైమే తెలియడం లేదు.

"ఆవిడకు మెళకువ వచ్చినా ఆవిడతో ఈ విషయాలు జ్ఞాపకం చెయ్యకండి! పైగా మీ అబ్బాయి దగ్గర నుంచి ఫోను వచ్చింది. కులాసాగా ఉన్నాడని చెప్పండి? ఈ లోపుగా అతని సమాచారం ఏదైనా తెలియవచ్చు. అతను బతికే ఉన్నాడని భావిద్దాం!" అంటూ అందరికీ ధైర్యం చెప్పి డాక్టరు ఇంటికి బయలుదేరాడు. అతని వెనుకే కొందరు ఇళ్ళకు బయలుదేరారు.

"తెల్లారాక మళ్ళీ వస్తాం! ఈ లోపుగా ఏదైనా తెలిస్తే కబురు చేయండి" అంటూ మరికొందరు కదిలారు.

ఇరుగు పొరుగు వాళ్ళు ఓ ఇద్దరు ఆడమగ అక్కడే ఉండిపోయారు. నిద్ర ఆగలేక వీధి అరుగుమీద చాపలేసుకు పడుకున్నారు మగవారు. ఆడవాళ్ళు మాత్రం ఆవిడ మంచాన్ని ఆనుకుని కూర్చున్న వాళ్ళు కూర్చున్నట్లుగానే కళ్ళు మూసారు. కాసేపటికి నిద్రలోకి జారుకున్నారు.

రత్తమ్మ మాత్రం ఆవిడ మంచం పక్కన స్టూలు మీద అలాగే కూర్చుండి పోయింది.

తెల్లవారగానే డాక్టరు వచ్చి ఆమెను చూసాడు. జాగ్రత్తగా అన్ని పరీక్షలు చేసాడు. "సాయంకాలం వరకు సెలైన్ ఎక్కిస్తాను. అప్పటికి ఆమె పూర్తిగా కోలుకుంటుంది. ఈలోపుగా ఆమెకు స్పృహ వస్తే నాకు తెలియజేయండి" అంటూ తగిన జాగ్రత్తలు చెప్పి తిరిగి వెళ్ళిపోయాడు.

వీథుల్లో పడుకున్న మగవారు లేచి ఇళ్ళకు వెళ్ళారు. ఇంట్లో ఉన్న ఆడవాళ్ళు రత్తమ్మకు తోడుగా అక్కడే ఉండిపోయారు.

ఉదయం 10 గం॥ అయింది. ధాత్రీశ్వరీదేవి మెల్లిగా కళ్ళు విప్పింది. ఆ వీధిలో వాళ్ళంతా తిరిగి ఆవిడ చుట్టూ చేరారు. ఆవిడ అందరిని చూసింది. ఆ వార్త డాక్టరుకి చెప్పడానికి ఒకాయన వెళ్ళాడు. ఆవిడ తిరిగి కళ్ళుమూసుకుంది.

డాక్టరు వెంటనే ఆయన స్కూటరు మీద వచ్చాడు. ఆవిడ తిరిగి పడుకుని ఉంది. డాక్టరుకి కూడా కొంచెం ఆశ్చర్యమేసింది. "ఈపాటికి ఆవిడ కాస్త కోలుకోవాలి. ఫరవాలేదు. సాయంకాలానికి మామూలు కావచ్చులెండి?"అని తీసుకోవలసిన జాగ్రత్తలు చెప్పి ఆయన తిరుగు ముఖం పట్టాడు.

ఆ సాయంకాలానికి కూడా ఆవిడ పరిస్థితి అలాగే ఉంది.

"మరో రోజు చూద్దాం! అసలే బాగా నీరసంగా ఉన్నారుగా ఈ వార్త ఆవిడను మరింత కుంగతీసింది. మరేం భయంలేదు" అంటూ డాక్టర్ ఇంజక్షన్లు మార్చి, మందులు కూడా కొత్తవి ఇచ్చాడు. మందులు మింగలేదు. అవి ముక్కుద్వారా ఆహారంతోపాటు ఎక్కించడం మొదలు పెట్టాడు. డాక్టరు ఉన్నంత సేపు అందరికి ధైర్యంగానే ఉంటోంది. అతను వెళ్ళిన తరువాత అందరికి లోపల భయంగానే ఉంది. పైకి ఏమీ అనలేకపోతున్నారు.

మూడవరోజు వచ్చింది. ఆవిడ ఆరోగ్య పరిస్థితి యథాతథంగానే ఉంది. "ఈ ఒక్కరోజు చూసి పట్నం తీసుకువెళ్ళి పెద్దాసుపత్రిలో చేరిపిద్దాం" అన్నాడు డాక్టరు. అతనికి మనసులో అధైర్యం ప్రారంభమయింది. ఇంక వైద్యం ఏం చెయ్యాలో అతనికి పాలుపోలేదు.

ధాత్రీశ్వరీదేవి కొడుకు సంగతి ఎవరికీ ఏమీ తెలియలేదు. ఎవరికి తెలుసున్న వాళ్ళు ఉన్నా వారినందరిని అతని సంగతి అడుగుతూనే ఉన్నారు. ఎవరికి అతన్ని గురించిన విషయాలేమి తెలియలేదు. చివరకు ఊళ్ళో ఉన్న పోస్టాఫీసు టెలిఫోనులో విదేశాలకు మాట్లాడే అవకాశముందని తెలుసుకున్నారు. అమెరికాకు అక్కడ నుండి ఫోను చెయ్యాలని నిర్ణయించారు. ఆ అబ్బాయి ఆఫీసు నెంబరు, ఇంటి నెంబరు తీసుకుని బయలుదేరారు. ఎంతసేపు చేసినా ఆఫీసు నెంబరు ఎంగేజ్ వస్తోంది. ఇంటినెంబరు రింగ్ అవుతోంది. కాని ఎవరు ఎత్తడంలేదు. వారి అనుమానాలు నిజమయ్యాయి. బహుశా అతను బతికి లేడనే నిర్ణయించుకున్నారు.

"అయ్యో! బాబూ! నూరేళ్ళు బతకవలసిన జీవితం అప్పుడే బూడిద పాలయిందా బాబూ! నీ తల్లికి కొరివి పెట్టవలసిన నువ్వే ముందు వెళ్ళిపోయావా నాయనా!"

అంటూ గుండెలు పగిలేలా రత్తమ్మ ఏడ్చింది. ఆ ఏడుపుకు అక్కడి వారి గుండెలేకాదు ఆ యింటి నాలుగు గోడలు కూడా పగిలినట్లనిపించింది.

ధాత్రీశ్వరీదేవి కళ్ళు ఎప్పుడు తెరిచిందో ఎవరు చూడలేదు. అందరిని గుర్తుపట్టనట్లే చూస్తోంది.

"అమ్మా! ధాత్రీశ్వరీదేవీ!" అంటూ ఆవిడను కుదిపి పలకరించింది ఎదురింటావిడ. రత్తమ్మ కన్నీళ్ళు తుడుచుకుని లేని ధైర్యం తెచ్చుకుంది. ఆవిడను ఎట్లాగైన దక్కించు కోవాలనుకుంది.

మెల్లిగా ఆవిడను లేపి కూర్చోపెట్టింది. బలవంతంగా పళ్ళరసం తెచ్చి తాగించింది. ఆ చూపుల్లో ఏ మార్పులేదు. వెంటనే డాక్టరుకి కబురు చేసారు.

ఆయన వచ్చి జాగ్రత్తగా పరీక్షించాడు. ఎంత పలకరించినా మాటలేదు. అయోమయంగా చూస్తోంది.

"ఏమైంది డాక్టర్" అందరూ ఒకేసారి ప్రశ్నించారు.

"కాస్త మతిస్థిమితం తప్పిందేమో అనిపిస్తోంది. పైగా మాటకూడా లేదు" డాక్టరు నీరసంగా సమాధాన మిచ్చాడు.

"అయ్యో! ఎంత పని జరిగింది? కొడుక్కోసం నోరార ఏడవడానికి కూడా లేదు" అంటూ అందరు కన్నీళ్ళు పెట్టుకున్నారు.

"ఎలాగైనా ఆవిడనైనా బతికించు డాక్టర్" అంటూ వెక్కి వెక్కి ఏడ్చింది రత్తమ్మ.

"ఏ కంగారు లేదు. పట్నం డాక్టరుతో ఇప్పడే మాట్లాడుతాను. రేపు తీసుకువెడదాం! అన్ని ఏర్పాట్లు చేయిస్తాను ధైర్యంగా ఉండండి" అంటూ డాక్టరు బయలుదేరాడు.

ఆ యింట్లోనే కాదు, ఇంటి చుట్టూ కూడా శనిదేవత ఆవరించినట్లయింది. పెరటిలో ఆ కాలంలో పూచే పూలచెట్లన్నీ నాలుగు రోజుల నుంచి ఎండిపోయాయి. రంగు రంగు గోరింటలు, ముద్దబంతులు, ఎఱుపు, తెలుపు, పచ్చ చేమంతులు, కనకాంబరాలు సగం ఎండిపోయాయి. పెరటిశోభ సగం క్షీణించి పోయింది. అవతలి పెరటిలో గేదె వేళకి గంజి, చిట్టు, తౌడు, పచ్చగడ్డిలేక సగం చిక్కిపోయింది. ధాత్రీశ్వరీ గారికి తప్ప అది పాలివ్వదు. ఎప్పుడైన ఆవిడ లేనప్పుడు ఆవిడ చీరకట్టుకుని రత్తమ్మ పాలు పిండడానికి వెడితే ఆ గేదె కదలకుండా పాలు పిండనిచ్చేది. మరెవరిని దగ్గరకు రానిచ్చేదికాదు. ఇప్పుడు పుట్టెడు దుఃఖంలో ఉన్న రత్తమ్మకు పాలుపిండే తీరికా

లేదు. పైగా మనసులేదు. ధాత్రీశ్వరీదేవి పరిస్థితి ఆ గేదెకు అర్థమయినట్లుంది. అది కూడా చిక్కి శల్యమయింది.

డాక్టరుగారు వచ్చారు. "అక్కడ పట్నంలో అన్ని ఏర్పాట్లు చేసాం. మనం బయలుదేరాలి" అన్నాడు డాక్టరు.

రత్తమ్మ మరికొందరి సాయంతో ఆవిడ ఒళ్ళంతా వేన్నీళ్ళతో తుడిచింది. చీరమార్చి మరో ఇస్త్రీ జరీచీర కట్టింది. తలదువ్వి వేలు ముడివేసింది. ఒంటి మీది నగలు తీసి దాచమని అందరు సలహాలిచ్చారు.

"అందుకు నే నొప్పుకోనమ్మా! ఆవిడ జీవితం మోడైపోయింది. కన్న కడుపు మోడైపోయింది. ఇల్లు మోడైపోయింది. ఆవిడ శరీరంకూడా మోడైపోతే నే చూడలేనమ్మా! కనీసం బంగారంతోనైనా ఆవిడను పచ్చగా ఉండనీయండమ్మా!" రెండు చేతులతో ముఖం కప్పుకుని బావురుమంది రత్తమ్మ.

"అలాగే నీ యిష్టప్రకారం ఉండనియ్యి. నువ్వు ఏడవకు? నిన్ను మేం చూడలేం" అందరూ పట్టుకుని ఆవిడను ఓదార్చారు. రత్తమ్మ దుఃఖం తగ్గి కాస్త తేరుకుంది. అంతలో బల్ల పక్కన ఉన్న ఫోను మోగింది. అదొక విజయ భేరీలా అనిపించింది. అందరి దృష్టి ఫోను మీదే!

"ఈ రోజు ఆదివారం అమ్మకి తప్పకుండా ఫోను వస్తుంది. అదీ కొడుకు అమర్‌నాథ్ దగ్గర నుంచే" ఒక్క గంతులో ఫోను దగ్గరకు రత్తమ్మ చేరింది.

"అది తప్పకుండా అమెరికా ఫోనే" అరిచింది రత్తమ్మ. ఆ శబ్దానికి కాబోలు ధాత్రీశ్వరి కళ్ళు విప్పి ఫోను వైపు చూసింది. పక్కన ఉన్న ఆవిడ బంధువులేపి కూర్చోపెట్టింది. రత్నమ్మ ఆవిడను గట్టిగా పట్టుకుంది.

ధాత్రీశ్వరీదేవి కూర్చుంది. ఆవిడ కళ్ళలో ఏదో జీవకళ తళుక్కుమంది. డాక్టరు ఆశ్చర్యంగా చూస్తున్నాడు. తిరిగి ఫోను మోగింది.

రత్తమ్మ ఫోను ఎత్తింది "హల్లో" శక్తి కొద్దీ అరచింది.

"అమ్మా! అమ్మా! నేను నేను" అవతలికంఠం.

"బాబూ! అమర్‌నాథ్!" రత్తమ్మ కంఠం జీరపోయింది.

"అమ్మా! ఎలా ఉన్నావూ?"

వస్తున్నారుండు బాబూ! రత్తమ్మ సమాధానం చెప్పింది. "రా, తల్లీ! ధాత్రీశ్వరీదేవీ! రా! రా! నీ కొడుకు గొంతు విను" అంటూ అరచింది.

ధాత్రీశ్వరిని నడిపించుకుంటూ ఫోను దగ్గరకు తీసుకు వచ్చాడు డాక్టరు.

"నీ కొడుకుతో మాట్లాడూ!, మాట్లాడూ!" అందరూ బలవంత పెట్టారు.

గతం గుర్తులేని ధాత్రీశ్వరీదేవి ప్రస్తుతంలోకి వచ్చింది.

"బాబూ! అమర్! బాగున్నావా?" కడుపులో గడ్డకట్టిన దుఃఖమంతా కరగి కరగి వరదై కళ్ళలో నుంచి ఉబికి వచ్చింది.

"అమ్మా! ఇండియా బయలుదేరుతున్నా! ఏ విమానముంటే అందులో వచ్చేస్తా! భయపడకు, నేను బాగానే ఉన్నా! బయలుదేరే ముందు ఫోను చేస్తా!" అంతలో ఫోను కట్టయింది.

"బాబూ! అమర్! అమ్మకోసం వచ్చేస్తున్నావా? బాబూ!"ఆవిడ కంఠం వణుకుతోంది. గుండెలు బాదుకు ఏడ్చింది. ఎవరూ ఏమీ మాట్లాడలేదు.

"రత్తమ్మా! బాబు వచ్చేస్తున్నాడు. వాడికేమి యిష్టమో నీకు తెలుసుగా! అన్నీ తయారు చేసేసెయ్యి. బాబు వచ్చేస్తున్నాడు" అంటూ వెఱ్ఱి ఆనందంతో ఇల్లంతా తిరిగింది.

"నా బంగారు తల్లీ! నీకు మంచి రోజులొచ్చాయే! నీ కొడుకు వచ్చేస్తున్నాడే! నీ కలల పంట వస్తున్నాడే!" రత్తమ్మ కౌగిలించుకుంది.

ప్రాణం కడగంటి మళ్ళీ వస్తుందంటారు. కొడుకు చనిపోయాడనగానే ప్రాణం స్థంభించిపోయింది. మళ్ళీ అతని ఫోను వినగానే లేచి కూర్చుంది కాబోలు. పైగా వాడిన మందులు శారీరకంగా బలం చేకూర్చి ఉంటాయి". అడిగిన వాళ్ళకు సమాధానం చెప్పాడు.

"అవును బాబూ! ఆ రాత్రి విషం కురిసిన రాత్రి - ఈ రోజు అమృతం కురిసిన రోజు, ఆవిడ ప్రాణం తిరిగి వచ్చిన రోజు" అంది రత్తమ్మ.

"నిజమే! చనిపోయాడనుకున్న ఆవిడ కొడుకు బతికివచ్చిన రోజు కూడా!"

అతను ఆ రోజు ఆఫీసుకెళ్ళకుండా మరో ఆఫీసుకి పనిమీద వెళ్ళడం ఆ తల్లీ కొడుకుల అదృష్టమే కదా!" అన్నాడు డాక్టరు.

"నిజమేనయ్యా! నీ ధైర్యంతోపాటు నీ మాట కూడా గొప్పదేనయ్యా! అన్నారు అందరూ సంతోషంగా!"

*1-1-2002. ఆంధ్రప్రదేశ్ పత్రిక కథల పోటలో ఎన్నికైన కథ.*